## క్లుప్తంగా

### సాంస్కృతిక కార్యక్రమాల్లో అభిరుచి ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సెక్టోరియల్ అధికారి రాజేశ్

జగిత్యాల:విద్యార్థులకు చదువుతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాల్లో అభిరుచి ఉండాలని సెక్టోరియల్ అధికారి రాజేశ్ అన్నారు. సమగ్ర శిక్ష విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి రోల్‌పే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, ఆరోగ్యం పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని, జంక్ ఫుడ్ తీసుకోవద్దని, ఇంటర్నెట్ గాడ్జెట్స్ వాడటం తగ్గించుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందింఆచరు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలుగా రాజేంద్రప్రసాద్, సతీశ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న చైర్మన్, కమిషనర్

రాయికల్: పట్టణంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ప్రత్యేక హెల్త్ క్యాంప్ అనంతరం సన్మానించారు. కార్యక్రమంలో చైర్మన్‌మోర హన్మండ్లు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, వైద్యులు పాల్గొన్నారు.

### వృద్ధులకు సన్మానం



వృద్ధులను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్

జగిత్యాల: వయోవృద్ధులను ఆదరించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మంగళవారం వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో పలువురిని సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, జిల్లా సంక్షేమాధికారి నరేశ్, హరి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటింటా వైద్య పరీక్షలు



వృద్ధురాలికి బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండలో ఇంటింటికీ వెళ్లి వైద్య సిబ్బంది వైద్య పరీక్షలను నిర్వహించారు. మంగళవారం గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి వైద్యాధికారి ఎమ్ఎల్‌హెచ్‌పీ మాధవి, బీపీ, రక్త పరీక్షలను చేయడంతో పాటు జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలను ఉన్నవారిని గుర్తించి మందులు అందించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ప్రమీల, వణిత, సుప్రియ పాల్గొన్నారు.

### ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సొంతం




సమావేశంలో ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్

సారంగాపూర్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం మీ సొంతమవుతుందని జగిత్యాల జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ సంఘం అధ్యక్షుడు రమేశ్ బాబు అన్నారు. మంగళవారం బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల కంటే అత్యుత్తమమైన బోధన అందుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. కార్యక్రమంలో బీర్‌పూర్ కళాశాల ప్రిన్సిపల్ వి.రామకృష్ణ, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



### బతుకమ్మ సందడి బాగుంటుంది



మాది జగిత్యాల సమీపంలోని రావల్లి. పెళ్లయ్యాక జగిత్యాలలో స్థిరపడ్డాం. బతుకమ్మ పండుగ వచ్చిందంటే చాలు ఎప్పుడు తెల్లారుతుందా అని ఎదురు చూసే వాళ్లం. తెల్లవారుతూనే తంగెడు, గునుగు, గుమ్మడి, కలువ పూలు సేకరించి బతుకమ్మలను పేర్చి సాయంత్రం ఆడిపాడే వాళ్లం. – కైరి వాణి, జగిత్యాల

### సంస్కృతికి రూపం



బతుకమ్మ పండుగ ప్రధానంగా తెలంగాణ ప్రజల సంస్కృతీసంప్రదాయాలతో పాటు మన జీవన విధానాన్ని తెలిపే విధంగా ఉంటుంది. తొమ్మిది రోజుల పాటు మహిళలంతా తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడుతాం. – మహేశ్వరీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

### ఇష్టమైన పండుగ



తొమ్మిదిరోజులపాటు జరిగే బతుకమ్మ పండుగను మహిళలం మరిచిపోలేం. ఏడాదికోసారి వచ్చే బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించుకుంటేనే ఎప్పటికీ ఆనందంగా ఉంటుంది. బతుకమ్మను ఎంతో ఘనంగా నిర్వహిస్తుండటం అభినందనీయం. – గద్దం లహరి, భూషణరావుపేట

## కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై అవగాహన కరువు

• కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కథలాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వానికి పరిపాలనపై అవగాహన కరువైందని, అందుకే ప్రజలు నిరాశ నిస్పృహలో ఉన్నారని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. మండలంలోని పోసానిపేట గ్రామశివారులో మండల బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు వనభోజనం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ హాజరై మాట్లాడారు. అసత్యపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులు కష్టపడి పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా కేసులు పెట్టి భయాందోళనకు గురిచేస్తుందని, నాయకులు భయపడవద్దన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జవ్వాజి రేవతి, నాయకులు కిరణ్‌రావు, బొడ్డు బాలు, పాల్గొన్నారు.

**రత్నాకర్ రావు విగ్రహానికి మున్సిపల్ నిధులు సరికాదు**

కోరుట్ల: పట్టణంలో ఏర్పాటు చేస్తున్న మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహ నిర్మాణానికి విరాళం ఇస్తానని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ మున్సిపాల్టీలో నిధుల కొరత కారణంగా కార్మికులకు జీతాలు కూడా సరిగా ఇవ్వలేక పోతున్నామని, పట్టణంలో కనీసం రోడ్ల మరమ్మతుకు కూడా నిధులు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో రత్నాకర్ రావు విగ్రహ ఏర్పాటుకు మున్సిపల్ ఫండ్ వినియోగించటం సరికాదన్నారు. కావాలంటే సొంతంగా విరాళం అందిస్తానని తెలిపారు. నియోజకవర్గంలో అధికారులు ప్రోటోకాల్ పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## 'రైతులను తప్పుదోవ పట్టిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్'



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ అంజిరెడ్డి

కోరుట్ల రూరల్: రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రుణ మాఫీ పేరిట రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయని కోరుట్ల ఏఎంసీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. రైతులకు ఒకే సారి రూ. 2 లక్షలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిదే అన్నారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను ప్రభుత్వం సేకరించి త్వరలోనే రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమ చేస్తుందన్నారు.ఈ సీజన్‌లో సన్న రకం వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పుల్లూరి వెంకటేశ్ గౌడ్, డైరెక్టర్లు బాపు రెడ్డి, శ్రీనివాస్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సైదు గంగాధర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు



క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మెట్‌పల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారు బీర్‌పూర్ మహాత్మా జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు. ప్రస్తుతం మెట్‌పల్లి పట్టణంలో నిర్వహిస్తున్న ఈ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు అథ్లెటిక్స్‌లో ప్రతిభను చాటుతున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్–14 విభాగంలో ఎస్ జశ్వంత్(షాట్‌పుట్), జి మనోజ్(రన్నింగ్), ఇంటర్ డిస్ట్రిక్ పోటీలకు అండర్–17 విభాగంలో ఎస్ జశ్వంత్, అభిరామ్(కబడ్డీ)లు, అండర్–14 విభాగంలో జి మనోజ్(కబడ్డీ) ఎంపికయ్యారు. అలాగే జిల్లా స్థాయిలో నిర్వహించే అథ్లెటిక్స్ పోటీల్లో మరో 16 మంది విద్యార్థులు పాల్గొనున్నారు. వీరందరిని మంగళవారం ప్రిన్సిపాల్, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఉమ్మడి జిల్లా క్రికెట్ పోటీలకు అల్లీపూర్ విద్యార్థి



హర్షవర్ధన్

రాయికల్: మండలంలోని అల్లీపూర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతన్న హర్షవర్ధన్ అనే విద్యార్థి ఉమ్మడి జిల్లా అండర్–14 క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈనెల 4న సిరిసిల్లలో నిర్వహించే క్రికెట్ పోటీల్లో హర్షవర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారున్ని హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

### కబడ్డీ జోనల్‌స్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థిని



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న జె. హిమజ కబడ్డీలో జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రత్యేకాధికారి రజిత మంగళవారం తెలిపారు. గత నెల 24న జగిత్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ –17 బాలికల కబడ్డీ పోటీల్లో పాల్గొని, జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రత్యేకాధికారి రజితతో పాటు ఉపాధ్యాయులు అభినందించి, జ్ఞాపికను అందచేశారు.కార్యక్రమంలో పీఈటీ సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సొంత ఖర్చులతో గాంధీ విగ్రహం ఏర్పాటు

మల్యాల: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి సాధించిన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేసి, గాంధీ భావజాల వ్యాప్తికి కృషి చేస్తున్నాడు మల్యాల మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన మూలె మోహన్ రెడ్డి. తక్కళ్లపల్లిలో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆరేళ్ల క్రితం గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మోహన్ రెడ్డి సుమారు రూ.1లక్షకు పైగా సొంత డబ్బులు వెచ్చించి గాంధీ విగ్రహం ఏర్పాటు చేశాడు. ఏటా గాంధీ జయంతి, వర్ధంతిల రోజు విగ్రహాన్ని శుభ్రం చేసి నివాళి అర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

### 100 శాతం హాజరైన విద్యార్థులకు బహుమతులు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత నెలలో 100 శాతం హాజరైన విద్యార్థులకు మంగళవారం ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలనే ఉద్దేశ్యంతో ప్రతీ నెల విద్యార్థులకు బహుమతులు అందిస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంబటి రవి, బహుమతుల దాత గుండేటి శశి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### పేకాటరాయుళ్ల పట్టివేత

కోరుట్ల: పట్టణ శివారులోని ఐస్‌ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం రాత్రి పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి సుమారు రూ. 8వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా పరంధాములు

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేట గ్రామ మున్నూర్ కాపు సంఘం కార్యవర్గంను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిందం పరంధాములు, ప్రధాన కార్యదర్శిగా తోట గంగయ్య, ఉపాధ్యక్షుడిగా పొర్తి మహేశ్, సహాయ కార్యదర్శిగా రాజుల రాజేశం, కోశాధికారిగా గురిజల రాజిరెడ్డి, సహాయ కోశాధికారిగా గురిజల శేఖర్, రైటర్‌గా రాజుల సంతోష్ నియామకయ్యారు. కులసంఘం పెద్దల సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు



పొలాస జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

జగిత్యాల టౌన్/జగిత్యాలరూరల్/జగిత్యాలజోన్/రాయికల్/ ధర్మపురి/కథలాపూర్/పెగడపల్లి/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/సారంగాపూర్: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.విద్యార్థినులు వివిధ రకాల పూలు సేకరించి బతుకమ్మలు పేర్చి విద్యార్థినులు, టీచర్లు, చిన్నారులు, అంగన్‌వాడీ టీచర్లు సంప్రదాయంగా పాటలు పాడుతూ ఆడిపాడారు.



రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల్లో బతుకమ్మ వేడుకలు



సాతారం ప్రైమరీ స్కూల్‌లో..



ఇబ్రహీంపట్నం హైస్కూల్‌లో..

### రైతు ధర్నా విజయవంతం చేయాలి



ఇటిక్యాలలో మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి

రాయికల్: రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 4న చేపట్టే రైతు ధర్నాను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకుడు పొన్నం తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం రాయికల్ మండలం ఆలూరు, సింగరావుపేట, శ్రీరాంనగర్, కిష్టంపేట, కుమ్మరిపల్లి, రామాజీపేట గ్రామాల్లో రైతు సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తురగ శ్రీధర్‌రెడ్డి, మెక్కొండ రాంరెడ్డి, రాంచందర్‌రావు, మల్లన్న, గంగారెడ్డి, రాజిరెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థినికి సన్మానం

మల్లాపూర్: ఎంబీబీఎస్ సీటు సాధించిన మండల కేంద్రానికి చెందిన ఎర్ర ప్రజ్ఞను బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డితో పాటు వీడీసీ చైర్మన్ సంగ గంగరాజం, గ్రామస్తులు మంగళవారం వేర్వేరుగా సన్మానించారు. గ్రామానికి చెందిన ఎర్ర ప్రజ్ఞ ప్రతిభ కనబర్చి ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు లవంగ శివకుమార్, పట్టణ అధ్యక్షుడు ముష్కరి రాజ్‌కుమార్, వీడీసీ వైస్‌చైర్మన్ తుక్కారాం, నాయకులు పాల్గొన్నారు.

### లింగనిర్ధారణ నేరం

జగిత్యాల: లింగనిర్ధారణ నేరమని, స్కానింగ్ సెంటర్లకు వచ్చే వారికి ఎలాంటి పరీక్షలు నిర్వహించకూడదని రాష్ట్ర వైద్య శాఖ బృందం, ఆర్డీవో మధుసూదన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు స్కానింగ్ సెంటర్లను, నర్సింగ్‌హోమ్‌లను తనిఖీ చేశారు. స్కానింగ్‌కు వచ్చే ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయాలన్నారు. మూడు కేంద్రాల్లో పరికరాలు సీజ్ చేశారు. వారి వెంట మాత శిశు సంక్షేమాధికారి జైపాల్‌రెడ్డి ఉన్నారు.

### డీఎస్సీలో యువకుల ప్రతిభ

రాయికల్: పట్టణానికి చెందిన సింగని హరికృష్ణ స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్‌లో జిల్లా ఫస్ట్‌ర్యాంక్, ఉడుత రమేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ సెకెండ్ ర్యాంక్, సామల్ల రాజ్‌కిరణ్ సోషల్‌లో థర్డ్ ర్యాంక్, సింగని నరేశ్ మేథమెటిక్స్‌లో ఫోర్త్ ర్యాంక్, బూర్గుల శ్రీకాంత్ బయాలజీలో ఫోర్త్ ర్యాంక్, పుర్రె రమేశ్, పీఈటీ, పీడీలో జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: మండలంలోని చల్‌గల్ సబ్‌స్టేషన్, వాటర్‌వర్క్స్ రాజేశుని గుట్ట సబ్‌స్టేషన్, తాటిపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో బుధవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ రాజిరెడ్డి తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే



టాపర్లకు జ్ఞాపికలు అందిస్తున్న ప్రిన్సిపల్

ఇబ్రహీంపట్నం: ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉన్నత స్థాయికి వెళ్లారని, ప్రైవేట్ కళాశాలల కన్నా ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నారని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి కె. వెంకటేశ్వర్లు అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదవాలని, కళాశాలలో ఉన్నత ర్యాంకులు రావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులు దేవుళ్లు

• ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



కార్మికులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

జగిత్యాల: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలు ఎలాంటి అనారోగ్యం పాలు కాకుండా చూసే పారిశుధ్య కార్మికులే దేవుళ్లని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో మున్సిపల్ కార్మికులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పొద్దున లేవగానే మన కళ్లముందు కన్పించేది పారిశుధ్య కార్మికులేనని, డెంగీ, ఇతర విష జ్వరాల నుంచి కాపాడేది కార్మికులేనన్నారు. వారికి ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పీఎఫ్‌తో పాటు, లైఫ్ ఇన్సూరెన్స్ పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. చైర్‌పర్సన్ అడువాల జ్యోతి మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులదే కీలకపాత్ర అని, వారి కోసం హెల్త్‌క్యాంప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈపీఎఫ్ ఉమ్మడి కమిషనర్ తానయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు, శానిటేషన్, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

### మహనీయుల ఆలోచనలతో ముందుకుసాగాలి

• ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: యువత మహనీయుల ఆలోచనలతో ముందుకుసాగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కథలాపూర్ మండలం తుర్తి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీర పాండ్యా కట్ట బ్రహ్మన్న విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. దేశ చరిత్రలోనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని రైతులందరికీ ఏక కాలంలో రుణమాఫీ చేశామన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కానీ రైతులకు ప్రభుత్వం తప్పకుండా రుణమాఫీ చేస్తుందన్నారు. ప్రతి పక్షాల మాటలు నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, గండి నర్సయ్య, నాయకులు పులి హరిప్రసాద్, జవ్వాజి రవి, తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలక్రైం: ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. మంగళవారం సాయంత్రం జగిత్యాల నుంచి వెల్గటూర్‌కు వెళ్లే బస్సులో సుమారు 150 మంది ప్రయాణికులు ఎక్కడంతో కండక్టర్, డ్రైవర్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంత చెప్పినా వినకుండా ఇదిగో ఇలా.. ఫుట్ బోర్డుపై ప్రమాదకరంగా ప్రయాణించారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సునీత డిపో మేనేజర్, జగిత్యాల సెల్: 9959225925, 47

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643